క్లుప్తంగా

దిశ యాప్‌తో స్వీయ రక్షణ

• సీఐ రాజేంద్రనాథ్ యాదవ్



సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రాజేంద్రనాథ్ యాదవ్

అమడగూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌తో మహిళలు తమను తాము రక్షించుకోవచ్చని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన నల్లమాడ సర్కిల్‌కు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి అమడగూరు స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ వెంకటనారాయణ, సిబ్బందితో మాట్లాడుతూ మండలంలో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమడగూరు మండలం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో మద్యం, గుట్కా అక్రమ రవాణాపై పూర్తి నిఘా ఉంచాలన్నారు. దిశ యాప్‌ను మహిళల సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌పై అవగాహన ఉండేలా గ్రామాల్లో కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జమేదారు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



రాఘవేంద్రను సన్మానిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కు నూతన హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్రను 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం సన్మానించారు. గతంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఇదే పాఠశాలలో విధులను నిర్వహించారని గుర్తు చేశారు. 23 సంవత్సరాల తరువాత ప్రధానోపాధ్యాయునిగా పాఠశాలకు రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబ్‌జాన్, వడ్డిపేట ఆది, కుతుబుద్దీన్, ఖాదర్ బాషా, మురళీ మోహన్, వెంకటరవి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

15న 'ప్రజా వేదిక'

ముదిగుబ్బ: స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 15న బహిరంగ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ఉపాధి సిబ్బంది హాజరు కావాలని కోరారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పూల నరసింహులు

తనకల్లు: గ్రామాలలో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వైఎస్సార్ బీమాను 100 శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందనలో వచ్చిన ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనందయ్య పాల్గొన్నారు.

'జలకళ' బోర్ల పరిశీలన



బోరును పరిశీలిస్తున్న అధికారులు

ఓడీ చెరువు: రాష్ట్ర ప్రభుత్వం 'జలకళ' పథకం ద్వారా రైతుల పొలాల్లో ఉచితంగా వేసిన బోర్లను క్వాలిటీ కంట్రోల్ అధికారి కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు. సామాజిక తనిఖీలో భాగంగా ఏపీడీ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డితో కలిసి మంగళవారం నల్లగుట్లపల్లి, నారప్పగారిపల్లిలో ఆయన పర్యటించారు. బోరు ఎన్ని అడుగులు వేశారు, ఎన్ని అడుగుల్లో నీరు పడింది, ఎన్ని ఇంచీల నీరు వచ్చింది, సాగుభూమా? కాదా? విద్యుత్ సౌకర్యం ఉందా? తదితర వివరాలు ఆరా తీశారు.

నేడు అక్షరాభ్యాసం

ఓడీ చెరువు: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలోని విద్యాగణపతి ఆలయంలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంజనేయులు నాయుడు తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ పురోహితుల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు చెప్పారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ'

• ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి



పథకాలపై లబ్ధిదారులతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. మండలంలోని లక్కసముద్రం సచివాలయం పరిధిలోని రెడ్డెంవారిపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ఎంపీపీ రఫినాయక్, సర్పంచ్ తులశమ్మ, సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం రూ. లక్షల్లో లబ్ధి పొందుతోందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. రెడ్డెంవారిపల్లిలో సీసీ రోడ్డు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, సైడ్ కాల్వలు, పింఛన్ మంజూరు తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామక్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పురుషోత్తంరెడ్డి, ఫయాజ్ అహమ్మద్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, అగ్రీ బోర్డు చైర్మన్ చెన్నక్రిష్టారెడ్డి, సర్పంచ్‌లు శ్రీరామ్‌రెడ్డి, టోపీరమణ, పురుషోత్తంరెడ్డి, రమణారెడ్డి, రామమోహన్‌రెడ్డి, కుళ్లాయప్ప, నారాయణరెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, అంజి, శివ, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గాండ్లపెంట మండలంలో..

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో బుధవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాయకులు

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లిలో నిర్మించనున్న మారెమ్మ ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. స్థానిక నాయకుల ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. కార్యక్రమంలో రామ్ కిషోర్‌రెడ్డి, నాగార్జున, వలంటీర్ మహేంద్ర, జె.వెంకటరమణ, నారాయణప్ప, పెద్ద వెకట రమణ, నారాయణప్ప, లక్ష్మన్న, చిన్న వెంకట రమణ, ఆంజనేయులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సర్వేయర్ ఎం.అశోక్

ఎన్‌పీకుంట: మండల సర్వేయర్‌గా ఎం.అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో డిప్యూటీ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎన్‌పీకుంట వచ్చానన్నారు. తమ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

జీతాలు ఇవ్వాలి

కదిరి టౌన్: స్థానిక అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు 5 నెలల జీతాలివ్వాలన్నారు. పీఎఫ్ వివరాల స్లిప్పులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు జీఎల్.నరసింహులు, నాయకులు జగన్ మోహన్, రామ్మోహన్, గంగప్ప, ఫైరోజ్, విజయలక్ష్మి, శారద, ఫాతిమా, లక్ష్మిబాయ్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యాకానుక కిట్లు అందుకున్న విద్యార్థులు



కిట్లు అందిస్తున్న చాంద్‌బాషా, హెచ్‌ఎం మేరి



విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

గాండ్లపెంట: పేద విద్యార్థి కూడా ఉన్నత చదువులు చదవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నారని ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీటీసీ అమరావతి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రహంతుల్లా, ఎంఈఓ క్రిష్టానాయక్, హెచ్‌ఎం. మధురాంబా, పార్టీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం మేరి వరకుమారి సమక్షంలో విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ చాంద్‌బాషా కిట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని అన్ని మున్సిపల్ పాఠశాలల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, పాఠశాలల కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ మండలంలో..

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాఘవ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రాయుడు, పాఠశాల కమిటీ చైర్మెన్ చాంద్‌బాషా, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం



తాడిమర్రిలో కిట్ల పంపిణీ

తాడిమర్రి: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ బండారు బాలమ్మ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం అరుణ అధ్యక్షతన జరిగిన జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, షూ, బెల్టు, టైతో పాటు బ్యాగును అందించారు. ఎంఈఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాలల్లో 2,222 మందికి విద్యాకానుక పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బీసాని లింగమ్మ, ఉపాధ్యాయులు రాజేశ్వరి, నాగరాజు, సీఆర్పీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ భేషుగ్గా ఉంది



జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న రామ్మోహన్‌రావు, ఓబులపతి

పరిగి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లను సకాలంలో పంపిణీ చేసిన విద్యాశాఖ అధికారుల పనితీరు భేష్ అని మైనింగ్ అడిషనల్ డైరెక్టర్ రామ్మోహన్‌రావు, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) ఓబులపతి తెలిపారు. మంగళవారం వారు పరిగి మండలానికి వచ్చి, జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో ఉన్న ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలకు సరఫరా అయిన ఇండెంట్‌ను పరిశీలించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే జేవీకే కిట్లను పంపిణీ చేసిన ఎంఈఓ లక్ష్మీదేవి, ఎమ్మార్సీ సిబ్బందిని అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీ నాయకులతో ప్రాణహాని'



విలేకరులతో మాట్లాడుతున్న నాగేంద్రమ్మ

ముదిగుబ్బ: టీడీపీ నాయకులతో తమకు ప్రాణహాని ఉందని ముదిగుబ్బ ఎస్సీ కాలనీకి చెందిన కోమునుంతల ఆదినారాయణ, నాగేంద్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి చింతప్ప పేరుతో సర్వే నంబర్ 434–2లో 5.45 ఎకరాల భూమి ఉందని ఆదినారాయణ తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గోరుతల వెంకటనారాయణకు గుత్తకు ఇచ్చామని, అయితే, కొన్ని సంవత్సరాలు గుత్తకు చేసుకున్న ఆయన అక్రమంగా సాకే లక్ష్మన్న అనే వ్యక్తికి పేర్లు మార్చి పాసుపుస్తకాలు చేయించారన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరిగి భూమిని తిరిగి తమ పేరున చేయించుకున్నట్లు తెలిపారు. సోమవారం పొలంలో గుట్టలు చదును చేసుకుంటుండగా లక్ష్మన్నతో పాటు టీడీపీ నాయకులు తుమ్మల నాయుడు, సోమశేఖర్, వినోద్‌కుమార్, అశోక్, సుధాకర్ తదితరులు వచ్చి దౌర్జన్యం చేశారన్నారు. 'ఈ పొలం సాకే లక్ష్మన్నకు చెందింది. లక్ష్మన్న నుంచి మేం కొనుగోలు చేశామంటూ దాడి చేశార'ని ఆవేదన వ్యక్తం చేశారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, పోలీస్ స్టేషన్లో కూడా ఈ విషయంపై ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

బత్తలపల్లి: మండలంలోని గంటాపురం ఎస్సీ కాలనీలో మంగళవారం మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మహాగణపతి, సుబ్రమణ్య, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు, ధాన్యాధివాసం, దీక్షాహోమం, రుద్రహోమం, దుర్గాహోమం, శయ్యాధివాసము నిర్వహించారు. భక్తాదులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు పోట్లమర్రి సర్పంచు అక్కిం దామోదర్ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో అనర్థాలు

గాండ్లపెంట: పొగాకు వినియోగం వల్ల అనర్థాలు కలుగుతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాబాఫకృద్దీన్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కోరారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణలో ధూమపానం నేరమన్నారు. పొగాకు ఉత్పత్తులను అమ్మితే శిక్ష విధిస్తారన్నారు. ఈ విషయాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సామాజిక కార్యకర్త సమంతకమణి, సూపర్‌వైజర్ ఉపేంద్ర, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, పోలీసులు బాలాజీ, భాస్కర్‌రాజు, నరసింహులు తదితరులున్నారు.

ఖాతాలో నగదు అక్రమంగా డ్రా

• పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని పెడబల్లి జామియా మసీదుకు సంబంధించి కమిటీ సభ్యుల ఆమోదం లేకుండా అక్రమంగా బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేశారని కమిటీ సభ్యులు అల్లాబక్షు, హైదర్‌వలీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెడబల్లి జామియా మసీదుకు సంబంధించి మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో అల్లాబక్షు, హైదర్‌వలీ పేరిట జాయింట్ ఖాతా ఉందన్నారు. ఇందులో రూ.2,46,000 నగదు ఉందని తెలిపారు. ఖాతా నుంచి నగదు డ్రా చేయాలంటే కమిటీ సభ్యుల తీర్మానం ఉండాలన్నారు. అయితే, ఇదే గ్రామానికి చెందిన రఫీఖాన్, ఇర్షద్‌బాషాలు మౌజన్ చాంద్‌బాషా సహాయంతో రెండు దఫాలుగా రూ.రెండు లక్షలు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మసీదు లెటర్ ప్యాడ్, సీలు ఉపయోగించి అకౌంట్ పుస్తకం జిరాక్స్‌లో ఇద్దరి ఫొటోలు పెట్టి ఫోర్జరీ సంతకాలతో ఈ పని చేశారన్నారు. ఎస్ఐ సద్గురుడు మాట్లాడుతూ ఇరువురిని విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై ఇర్షద్‌బాషా మాట్లాడుతూ ఇమామ్, మౌజన్‌ల వేతనాలు చెల్లించడం కోసమే బ్యాంక్ నుంచి నగదు డ్రా చేశామని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ఎన్‌పీకుంట: బాల్య వివాహాలు చేయరాదని రెడ్స్ సంస్థ మండల కోఆర్డినేటర్ పాటూరి రవీంద్ర అన్నారు. మంగళవారం ఎస్.పీ.కుంట–2 అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాలు–అనర్థాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలోనే వివాహాలు చేయడం వలన భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ, మహిళల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ శంకరమ్మ, మహిళా పోలీస్ లలితకళ, అంగన్‌వాడీ కార్యకర్త భారతి పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాల అందజేత

కదిరి అర్బన్: కదిరి డిపోలో మే నెలలో ఉత్తమ ఆదాయం, ఇంధన పొదుపు పాటించిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లకు మంగళవారం డీఎం మైనోద్దీన్ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఒక్కొక్కరికీ రూ. 500 చెప్పున అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. నగదు పొందిన వారిలో కండక్టర్లు గోపీనాథ్, లక్ష్మీనరసమ్మ, గంగాధర్, డ్రైవర్లు శ్రీరాంనాయక్, గంగారాంలు ఉన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం హరిమోహన్, రామక్రిష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడికి చెందిన శివ అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివ కొన్ని రోజులుగా కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి పొలం వద్దకు వెళ్లి విష ద్రావకం తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న శివను గమనించిన పక్క పొలాల్లోని రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడిని చికిత్స గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిరుధాన్యాలపై చిన్నచూపొద్దు

• అవగాహన సదస్సులో వ్యవసాయశాఖ ఏడీ రవి



మాట్లాడుతున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: చిరుధాన్యాలపై చిన్న చూపు వద్దని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం స్థానిక కృషి భవన్‌లో చిరుధాన్యాలపై అధికారులు, రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏడీఏ రవి, వ్యవసాయ పరిశోధన స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సహజ దేవ హాజరై వాటి విశిష్టత, సాగు అవశ్యకతపై తెలియజేశారు. చిరుధాన్యపు పంటల సాగు, వాటి ఉత్పత్తుల వాడకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనే ఆలోచనతో ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 'మిల్లెట్ ఇయర్'గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో చిరుధాన్యపు పంటల సాగుపై అటు అధికారులు ఇటు రైతులు చిన్నచూపు చూడకుండా ప్రోత్సహించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు కూడా సజ్జ, రాగి, కొర్ర, జొన్నతో పాటు సంప్రదాయ పంటలైన ఆరిక, అండుకొర్రలు, ఊదల సాగు విస్తీర్ణం పెంపునకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ తరహా పంటల సాగుకు ముందుకు వచ్చే రైతులకు ఇన్‌పుట్స్ రాయితీతో విత్తనం ఇవ్వడంతో పాటు పండించిన తర్వాత మద్దతు ధర కల్పించి, కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పంటల విస్తీర్ణం పెరిగితే భవిష్యత్తులో ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ ఖరీఫ్‌లో గ్రామ గ్రామానా చిరుధాన్యపు పంటలు సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు చిరుధాన్యాల సాగుకు ముందుకు రావాలని కోరారు. చిరుధాన్యాల సాగులో జిల్లాను రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలుపుదామన్నారు. ఏవోలు పి.వెంకటేశ్వరప్రసాద్, శశికళ, సుచరిత, శ్యాంసుందరరెడ్డి, సోమశేఖర్, ఆత్మ చైర్మన్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా జీర్ణోద్ధరణ పూజలు



పూర్ణ కుంభాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



పూజలందుకున్న మల్లేశ్వరస్వామి

కనగానపల్లి: తగరకుంటలో వెలసిన శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జీర్ణోద్ధరణ పూజలు కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులతో ఉదయం నుంచి గణపతి, గోపూజ, పూర్ణాహుతి పూజలు చేయించారు. సాయంత్రం భక్తులు పూర్ణ కుంభాలను ఊరేగించి, గంగపూజ, రక్షాబంధన, కుంభాలంకార పూజలు చేశారు. పూజల్లో పాల్గొనేందుకు స్థానిక గ్రామస్తులతో పాటు బెంగళూరు నగరం నుంచి వందలాది మంది స్వామి కాపులు తరలివచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచి హోమాలు, మహా కుంభిషేకాలు నిర్వహించి, జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆస్తి కోసం వివాహిత నిరసన

కళ్యాణదుర్గం: బంధువుల చేతుల్లో ఉన్న ఆస్తిని భర్తకు ఇప్పించాలని ఓ వివాహిత పిల్లలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగింది. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందని దళిత భూ లక్ష్మిని కళ్యాణదుర్గానికి చెందిన అగ్రకుల యువకుడు వినోద్ కొన్నేళ్ల క్రితం ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే భర్త వినోద్‌కు రావాల్సిన ఆస్తి వాటాను ఇవ్వకుండా.. అతడి తరఫు బంధువులు అడ్డుపడుతున్నారని ఆమె వాపోయింది. తన భర్తకు రావాల్సిన ఆస్తి వాటాను ఇప్పించాలంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చిన్నారులతో కలిసి వంట సామాన్లతో నిరసనకు దిగింది. బాధిత మహిళకు దళిత సంఘాల నాయకులు ఆర్‌కే రాజు, గంగాధర తదితరులు మద్దతుగా నిలిచారు. వివాహితకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: ఇసురాళ్లపల్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వీర్రాజు అనే వ్యక్తిని మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. వీర్రాజు ఇంట్లో 20 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ ఎస్ఐ అలీ అహ్మద్ తెలిపారు.